క్లుప్తంగా

పలుకుదొడ్డిలో కేంద్ర బృందం పర్యటన

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో గురువారం ఉదయం ఉజ్వల భారత్ కేంద్ర బృందం సభ్యులు రాజశేఖర్, అల్లప్ప తదితరులు పర్యటించారు. గ్రామంలోని ఓడీఎఫ్‌లో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాలు, అదే విధంగా ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్లు, మనబడి నాడు–నేడు పనులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, సచివాలయ భవనం, పంచాయతీ కార్యాలయాలు పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీరివెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, పాఠశాల ఉపాధ్యాయుడు రాము, గ్రామస్తులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దంపతులకు గాయాలు

కల్లూరు: రోడ్డు ప్రమాదంలో అనంతపురం ఏపీఎస్పీ నాలుగో బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మద్దిలేటికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కానిస్టేబుల్ మద్దిలేటి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానంగా ఉన్నారు. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తెలు ఇద్దరు నన్నూరు వద్ద ఉన్న శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. దీంతో వారిని చూసేందుకు బుధవారం మద్దిలేటి తన భార్య జయలక్ష్మితో కలిసి సొంతూరు డోన్ పట్టణం నుంచి నన్నూరు శ్రీచైతన్య కళాశాల వద్దకు వచ్చారు. పిల్లలను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తిరుగు ప్రయాణంలో 44వ జాతీయ రహదారి హమారా ఘర్ వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో భార్యాభర్తలిద్దరూ గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప గురువారం తెలిపారు.

కల్లూరులో జ్యోతుల ఉత్సవం

కల్లూరు: నగరంలోని కల్లూరులో వెలసిన చౌడేశ్వరీ దేవి జ్యోతుల ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. రెండో రోజు ఉత్సవాలను తిలకించేందుకు కర్నూలు నగరంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. ఆలయం చుట్టూ రైతులు ఎద్దులతో, రజకులు గార్దభాలతో ప్రదక్షిణలు చేశారు. ఆలయం చుట్టూ ఉన్న బురదలో యువత కేరింతలతో సంబరాలు చేసుకున్నారు. ఒకరిపై ఒకరు బురద చలుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

కన్నడిగులకు అన్నదానం



కన్నడ భక్తులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామం వద్ద కన్నడిగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలంలోని భ్రమరాంబ, మల్లికార్జున స్వామల వారిని దర్శనార్థం కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు కాలినడక రావడం పరిపాటి. వీరందరూ తిరుగు ప్రయాణంలో మహానందీశ్వరుని దర్శించుకొని ఓర్వకల్లు, నన్నూరు మీదుగా వేర్వేరు వాహనాలలో వెళ్తారు. ఈ నేపథ్యంలో నన్నూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు అన్నదానం నిర్వహించారు. ఇందులో సుమారు 4 వేల మంది కన్నడ భక్తులు భోజనం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

29న కబడ్డీ పోటీలు

కర్నూలు (న్యూటౌన్): శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 29, 30వ తేదీల్లో కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు కె.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు, ఐదవ బహుమతి రూ.6 వేలు, ఆరో బహుమతి రూ.4 వేలు అందజేస్తారన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనదలచిన జట్లు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 99896 42989 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: మండల పరిధిలోని సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 2,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, కేసీ కాల్వకు 2,265 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

భగత్‌సింగ్‌కు నివాళి

పాణ్యం: స్వాతంత్ర్య ఉద్యమకారుడు భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలని సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ అన్నారు. గురువారం పాణ్యంలో భగత్‌సింగ్ 92వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బత్తిన ప్రతాప్, గని తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సర్జరీకి ఆధునిక హంగులు

రాయలసీమ జిల్లాలకు తలమానికమైన పెద్దాస్పత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ఆధునిక హంగులు సమకూరనున్నాయి. కాలిన గాయాలకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఒక్కోసారి ప్లాస్టిక్ సర్జరీ అత్యవసరమవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రూ.2.64 కోట్లతో ఆధునిక భవన నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అధికారుల పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో భవనం అందుబాటులోకి వచ్చి రోగులకు సేవలందించనున్నారు. – కర్నూలు(హాస్పిటల్)



నూతనంగా నిర్మిస్తున్న భవనం

- రూ.2.64 కోట్లతో ఆధునిక భవనం
- మరో రెండు నెలల్లో నిర్మాణం పూర్తి
- వైద్యులు, సిబ్బంది మంజూరు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ప్రతి సోమ, గురువారాల్లో ఓపీ సేవలు ఉంటాయి. ఓపీ రోజున 45 నుంచి 50 మంది, సగటున నెలకు 350 మంది చికిత్స నిమిత్తం వస్తున్నారు. ఇలా వచ్చిన వారిలో అవసరమైన వారికి మంగళ, శుక్రవారాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఇలా ఏటా 500 నుంచి 700 వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. గతంలో ఈ విభాగానికి ఒక్కరే వైద్యులుండే వారు. ఇప్పుడు ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు పీజీ సీట్లు కూడా అందుబాటులోకి రావడంతో వైద్యసేవలు విస్తరించాయి. ముఖ్యంగా ఈ విభాగంలో గ్రహణమొర్రి, చిన్నారులకు పుట్టుకతో వచ్చే లోపాలు, రీకన్స్ట్రక్టివ్ సర్జరీ (ప్రమాదాల్లో ఎముకలు విరిగిన తర్వాత అయ్యే గాయాలు), హ్యాండ్ సర్జరీలు(చేతిలో నరాలు, కండరాలు, ఎముకలు తెగిపోయినా సరిచేయడం), కాలిన గాయాలు, మచ్చలు, వైకల్యం, కాస్మొటిక్ సర్జరీలు(ముక్కు, బుగ్గలు, పెదాలు, కంటి రెప్పలు, చెవులపై ఉన్న లోపాలను తొలగించడం), ఫేస్‌లిఫ్ట్ సర్జరీ, స్థనాలు(బ్రెస్ట్) సర్జరీలు, పొట్టజారిపోయిన వారికి చేసే ఆపరేషన్లు, అధిక బరువును తగ్గించే లైపో సక్షన్ శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

కాలిన గాయాలైన వారికి..

ఈ ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో కాలిన రోగులకు ప్రత్యేకంగా చికిత్స అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వార్డు కూడా ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ సర్జరీ సేవలకు, కాలిన రోగులకు విడివిడిగా విభాగాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో నూతన భవన నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో కాలిన రోగుల వార్డును పేయింగ్ బ్లాక్‌కు మార్చారు. ఇక్కడ కొన్ని గదులను తీసుకుని అందులోనే రోగులను ఉంచి వైద్యం అందిస్తున్నారు. శుశ్రుతభవన్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగాన్ని కొనసాగిస్తున్నారు. అదే భవనంలోని డి–ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు.

గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో..

నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రీవెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్(ఎన్‌పీపీడిబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.6.7 కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇందులో రూ.2.64 కోట్లను భవనం కోసం ఇచ్చింది. అయితే రెండేళ్లైనా గత తెలుగుదేశం ప్రభుత్వం పనులు ప్రారంభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోగుల ఇబ్బందులను గుర్తించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఈ మేరకు ఏడాది క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఆసుపత్రిలోని లెప్రసీ విభాగం పక్కన నూతన భవన నిర్మాణం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. మరో రెండు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి అవుతుందని అధికారులు చెబుతున్నారు.

రోగుల ఇబ్బందులు తీరేలా..

ఎన్‌పీపీడీబీఐ ప్రోగ్రామ్ కింద ప్రత్యేకంగా కాలిన రోగుల కోసం నూతన భవనం, మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయి. ఈ మేరకు భవనంలో రెండు వెంటిలేటర్లు, నాలుగు వైటల్ పారామీటర్ మానిటర్స్, డెర్మాటోమ్, రెండు స్కిన్ గ్రాఫ్ట్ మెషర్, రెండు పోర్టబుల్ లైట్స్, ఐదు హంబీస్ నైఫ్ మంజూరయ్యాయి. దీంతో పాటు 37 మంది వైద్యులు, సిబ్బంది కూడా ఈ విభాగానికి మంజూరయ్యాయి. ఇందులో ఒక ప్లాస్టిక్ సర్జన్/బర్న్స్/జనరల్ సర్జన్, ఇద్దరు అనెస్తెటిస్ట్స్, నలుగురు మెడికల్ ఆఫీసర్స్, 12 మంది స్టాఫ్‌నర్స్‌లు, ఒక ఓటీ టెక్నీషియన్, ఇద్దరు డ్రెస్సెర్స్, ఇద్దరు మల్టీపర్పస్ రిహాబిటేషన్/సీబీఆర్ వర్కర్స్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 12 మంది మల్టీపర్పస్ వర్కర్స్(నర్సింగ్ ఆర్డర్లీ/నర్సింగ్ అటెండెంట్స్/సఫాయి కర్మచారి)లు ఉన్నారు. తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. త్వరలో కాలిన రోగులకు ఇది ఒక రెఫరల్ సెంటర్‌గా విస్తృతమైన సేవలు అందించనుంది.

త్వరగా కోలుకునే అవకాశం



నూతన భవన నిర్మాణం పూర్తయితే రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. ఈ భవనం పూర్తయితే వసతులు, సౌకర్యాలు మెరుగవడంతో పాటు వైద్యులు, సిబ్బందిని అదనంగా నియమిస్తారు. దీనివల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంది. కాగా నూతన భవనంపై మరో అంతస్తు నిర్మిస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించే అవకాశం ఉంది. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటే రోగులకు మేలు జరుగుతుంది.

– డాక్టర్ మంజులబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

రెండు నెలల్లో నిర్మాణం పూర్తి



ఎన్‌పీపీడీబీఐ కింద మంజూరైన నూతన భవన నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఈ భవనం దాదాపుగా పూర్తి కావచ్చింది. మరో రెండు నెలల్లో రోగులకు అందుబాటులోకి రానుంది. అవసరమైన వసతులు, సౌకర్యాలు కూడా యుద్ధప్రాతిపదికన ఏర్పాటవుతాయి.

– రాజగోపాల్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీఎంఎస్ఐడీసీ, కర్నూలు

వైభవంగా శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం



వెంకటగిరిలో స్వామి ప్రభోత్సవాన్ని నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో వెలసిన శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవ కార్యక్రమాన్ని గురువారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై కొలువుదీర్చి గ్రామంలోని దస్తగిరయ్య కట్ట వరకు ఊరేగించి తిరిగి దేవాలయం వద్దకు చేర్చారు. అంతకుముందు కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని శ్రీగిడ్డాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, రాముడు, వెంకటేశ్వరరెడ్డి, గిడ్డయ్య, వెంకటశివుడు, మద్దిలేటి, గిరిబాబు, లక్ష్మన్న, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

ఉగాది ముగింపు ఉత్సవాలు

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో గురువారం ఉగాది ముగింపు ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని దాసరి వీధిలో శ్రీ చింతలముని రంగస్వామి, మాల వీధిలో శ్రీ నల్లారెడ్డిస్వాములు వారి ఆలయాల నుంచి ఉత్సవ విగ్రహాలను అశ్వం సారథ్యంలో పల్లకీలో తూర్పు, పడమటి ఆంజనేయ స్వాములు ఆలయాలకు, కొటారుమిట్టలోని శ్రీ రంగస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలను నిర్వహించారు.

కొత్తూరులో గ్రామోత్సవం

పాణ్యం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి గ్రామోత్సవం వైభవంగా చేపట్టారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో అర్చకులు నారాయణస్వామి, వీరయ్య, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ప్రభోత్సవంలో పాల్గొన్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కొత్తూరులో గ్రామోత్సవ దృశ్యం

ఘనంగా చర్చి వార్షికోత్సవం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని అయ్యవురెడ్డి కాలనీలోని ఇంటింటి సువార్త చర్చి 13వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఇండియా ఎవరీ హోమ్ క్రూసెడ్ అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ కుమార్ హాజరయ్యారు. చర్చిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం, కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు రోషన్న, సుంకన్న, సోమన్న, ఆనంద రావు, రామసుబ్బయ్య, గుర్రప్ప, సిమియోన్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల నుంచి రైతులను కాపాడాలి

- ఐపీ పేరుతో మోసం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుల నుంచి పంట దిగుబడులను కొనుగోలు చేసే దళారులు తర్వాత సొమ్ము ఇవ్వకుండా ఐపీ పెడుతున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ఆరుగాలం కష్టించి పండించిన పంటను రైతులు దళారులకు అమ్ముకొని వారి చేతిలో మోస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐపీ పేరుతో రైతులను దగా చేస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు వీటిపై శాశ్వత పరిష్కారం చూపాలని వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని కోరారు. అంతేకాక పాణ్యం నియోజకవర్గంలో అధికంగా అరటి సాగు చేస్తున్నారని, ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల అరటితోపాటు మొక్కజొన్న, మిరప చేతికొచ్చే సమయంలో పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అంతేగాక వడగండ్ల వల్ల ఇతర పంటలకు కూడా నష్టం వాటిల్లిందని, అన్నదాతలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సభా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి వ్యవసాయశాఖ మంత్రి మాట్లాడుతూ వడగండ్ల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలిపారు. అదేవిధంగా దళారుల బారిన పడకుండా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, మోసం చేసే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం మండలంలోని వర్కూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ, ఏపీఓ రమాదేవితో కలిసి తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించిందని, ఆయా గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కూలీలు తమ ఆధార్ కార్డుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచేయించుకోవడంతో పాటు, బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయించుకోవాలన్నారు. మండుతున్న ఎండల వల్ల కూలీలు ఉదయం వేళల్లోనే త్వరగా పనుల్లోకి వచ్చి మధ్యాహ్నంలోగా పనులు ముగించుకొని వెళ్లాలని, రెండుమార్లు హాజరు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు.

25న మున్సిపల్ బహిరంగ వేలాలు

గూడూరు: 2023–24 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ బహిరంగ వేలాలు ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారపు సంత, కూరగాయల మార్కెట్, పెద్ద పశువుల కమేళా తదితర వాటికి వేలాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ఏళ్లనాటి సమస్య పరిష్కారం



మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను సత్కరిస్తున్న పడమర బీసీ కాలనీవాసులు

గూడూరు: పట్టణంలో దాదాపు 20 ఏళ్లుగా నెలకొన్న సమస్య ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చొరవతో పరిష్కారం అయింది. పడమర బీసీ కాలనీలో గృహాల మీదుగా 33 కేవీ విద్యుత్ లైన్ పోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ లైన్‌ను దూర ప్రాంతానికి మార్పు చేయాలని కాలనీవాసులు ఎన్నో ఏళ్ల నుంచి వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా పలుమార్లు దర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అయితే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కాలనీలో పర్యటించినప్పుడు సమస్యను స్థానిక మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్‌లు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో మాట్లాడి లైన్ మార్పు కోసం రూ. 21 లక్షలు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. గత రెండు రోజుల క్రితం స్థానిక విద్యుత్ శాఖ అధికారులు లైన్‌ను కాలనీకి దూరంగా మార్పు చేశారు. దీంతో కాలనీవాసులు గురువారం సంతోషం వ్యక్తం చేస్తూ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖలీల్, కాలనీవాసులు చికెన్ వలి, నాగేంద్రప్ప, కండక్టర్ మిన్నెల్ల, అబ్దుల్ ఖాదర్ తదితరులున్నారు.

ఘనంగా మూల పెద్దమ్మ జాతర



మూలపెద్దమ్మకు బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గడివేములలోని మూలపెద్దమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు తెలుగురాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా వివిధ దుకాణాలు వెలిశాయి. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మెడికల్ క్యాంపు, మినరల్ వాటర్ సదుపాయం కల్పించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో గుండు ఎత్తు పందెం, తాడు లాగు పోటీలు నిర్వహించారు. విజేతలకు చైర్మన్ చిన్నన్న, ఈఓ మోహన్, ధర్మకర్తలు బహుమతులను అందజేశారు. కాగా జాతరను పురస్కరించుకొని అమ్మవారికి పెద్ద ఎత్తున మహిళా భక్తులు ఊరేగింపుగా వెళ్లి బోనాలను సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరించి ఆకుపూజ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారి ఘటానికి వెళ్లారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చైర్మన్ చిన్నన్న, ఈఓ మోహన్‌లు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



ఎస్ కొట్టాలలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కాటసాని శివనరసింహారెడ్డి



బ్రాహ్మణపల్లెలో ఎద్దులు బండను లాగుతున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని ఎస్ కొట్టాల గ్రామంలో వెలసిన శ్రీ దస్తగిరిస్వామి ఉరుసును పురస్కరించుకొని గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి పోటీలను ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40వేలు, రూ30వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు సూర్యనారాయణరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో న్యూ క్యాటగిరీ ఎద్దులకు బండలాగుడు పోటీలను మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా రూ.70వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, మహేంద్రరెడ్డి, ఈశ్వరయ్య, ఉసేన్‌సా, జాకీర్‌ఉసేన్, చందమామ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపాడులో..

గూడూరు రూరల్/కోడుమూరు రూరల్/ఓర్వకల్లు: గూడూరు మండలంలోని పెంచికలపాడులో ఉగాది పండగను పురస్కరించుకుని గ్రామ పెద్దలు గురువారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలకు స్థానిక పత్తి వ్యాపారి రవి రూ. 30 వేల ఖర్చు చేసి బండను తయారు చేయించి ఇచ్చారు. పోటీల్లో పెద్ద మాదన్న వృషభాలు మొదటి బహుమతిగా రూ. 11016లు, రెండవ బహుమతిగా ఉప్పరి సుంకన్న వృషభాలు రూ.8000లు, మూడవ బహుమతిగా నర్సీమాన్ సింగ్ వృషభాలు రూ.6000, నాలుగవ బహుమతిగా నడిపి మాదన్న వృషభాలు రూ.4000 చొప్పున దాతలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుర్వ మద్దిలేటి, పింజరి బజారి తదితరులు పాల్గొన్నారు. కోడుమూరులోని రాములమ్మ దేవస్థానం వద్ద పెద్దబోయగేరి వాసులు గురువారం నిర్వహించిన ఎద్దుల గిరకబండి లాగుడు పోటీలను భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి ప్రారంభించడంతో పాటు, పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు. పోటీల్లో 13జతల ఎద్దులు పోటీ పడగా, రైతులు రంగన్న, రవిలకు చెందిన ఎద్దులు మొదటిస్థానంలో, రాముడు, మస్తాన్‌లకు చెందిన ఎద్దులు రెండవ స్థానంలో గెలుపొందాయి. కార్యక్రమంలో శ్రీలక్ష్మి వెంకటేశ్వరసామి ఆలయ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె గ్రామంలో గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను గ్రామ సర్పంచు జయభారతమ్మ, గ్రీన్‌కో మేనిజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 23 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఇందులో పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో, అదే యజమానికి చెందిన చిన్న జత వృషభాలు రెండవస్థానంలో, పాములపాడు మండలం తుమ్మలూరుకు చెందిన తెలుగు పల్లవి వృషభాలు మూడో స్థానంలో, అనంతపురం జిల్లా చాగల్లు ఆదినారాయణ వృషభాలు నాల్గో స్థానంలో, జూపాడుబంగ్లాకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు ఐదో స్థానంలో, ఎమ్మిగనూరు మండలం కడిమెల్ల రంగస్వామి వృషభాలు ఆరో స్థానంలో, వైఎస్సార్ జిల్లా సుంకులు గారిపల్లె జగన్‌మోహన్‌రెడ్డి వృషభాలు ఏడో స్థానంలో, ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన లక్ష్మీకరు జాకర్ వృషభాలు ఎనిమిదవ స్థానంలో నిలిచాయి. వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న ప్రతి జతకు ప్రోత్సాహక బహుమతి రూ.3 వేల చొప్పున ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజశేఖర్‌చౌదరి, నాగేశ్వరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





కొత్తూరు, కోడుమూరులలో బండలాగుడు, గిరకబండి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



పెంచికలపాడులో విజేతగా నిలిచిన వృషభాల యజమానికి బహుమతి అందిస్తున్న ఉప్పరి అయ్యప్ప